క్లుప్తంగా

రేపు వారపుసంత వేలం

మాకవరపాలెం: ఈ నెల 20న వారపు సంత వేలం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంతలో ఏడాదిపాటు ఆశీలు వసూలుకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 20న మండల పరిషత్ కార్యాలయంలో జరగనున్న వేలంలో పాటదారులు రూ.25 వేల డీడీతో హాజరుకావాలన్నారు.

ఘనంగా గజ్జాలమ్మ పండగ



మల్లాంలో గజ్జాలమ్మను దర్శించుకుంటున్న చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్నాథ్

బుచ్చెయ్యపేట : మల్లాం గ్రామంలో గజ్జాలమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు, నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్నాథ్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బర్ల శివ, చింతపాక, వీపీ అగ్రహారం, రాజుపాలెం గ్రామాల్లో గజ్జాలమ్మ పండగ నిర్వహించారు.

నారాయణరాజుపేటలో ప్రకృతి సాగు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న రైతులు, మహిళలు

మాకవరపాలెం: నారాయణరాజుపేటలో ఈ ఖరీఫ్ నుంచి వందశాతం ప్రకృతి సేద్యం చేయనున్నట్టు ఏవో చిరంజీవి తెలిపారు. ఈ గ్రామంలో మంగళవారం రైతులు, మహిళా సంఘాలతో ర్యాలీ చేశారు. ఖరీఫ్ నుంచి అన్ని పంటలను ప్రకృతి సేద్య పద్ధతిలో చేపట్టనున్నట్టు ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం ఏవో మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఈ గ్రామంలో సాగుకు సంబంధించి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లో రైతులు ప్రకృతి సాగు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సేద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీవీ అగ్రహారంలో మోదకొండమ్మ తీర్థం



పోటీల్లో దాడు తీస్తున్న ఎడ్లు

మాడుగుల రూరల్ : మండలంలో వీరవల్లి అగ్రహారం గ్రామంలో గల మోదకొమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం సమీపంలో ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 15 ఎడ్ల జతలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఈకేవైసీ పరిశీలించిన ఎంపీడీవో

మాడుగుల రూరల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు సంబంధించి గ్రామాల్లో తమ సమస్యల గురించి మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తారు. ఆ ఫిర్యాదులు పరిష్కారం అయితే వాటికి సంబంధించి ఈకేవైసీని ఎంపీడీవో మంగళవారం పరిశీలించారు. వీరవల్లి అగ్రహారం గ్రామంలో సచివాలయంలో సంబంధిత వ్యక్తుల నుంచి ఈకేవైసీ చేశారు. పంచాయతీ కార్యదర్శి ఇ.శంకర్ పాల్గొన్నారు.

76 మందికి కంటి పరీక్షలు



కె.ఎం.పాలెంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు

దేవరాపల్లి: కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ గంధం రామకృష్ణ ప్రారంభించారు. ఈ కంటి వైద్య శిబిరంలో 76 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 26 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య శిబిరంలో సాయి కుమార్, పి.లక్ష్మీప్రియ, బి.శ్రావ్య తదితరులు ఎల్.వి. ప్రసాద్ ఆస్పత్రి వైద్య సిబ్బంది పరీక్షలు జరిపారు. పంచాయతీ కార్యదర్శి వినోద్, కోఆర్డినేటర్ స్వాములు, ఎస్.శాంతి పాల్గొన్నారు.

రబీ దిగుబడులపై వర్రీ!

వరి చేలుకు మంచు దెబ్బ
ఆపై కూలీల కొరత
ఇబ్బందులు పడుతున్న రైతులు
ఉపాధి పనులు సాగుకు అనుసంధానం చేయాలని కోరుతున్న రైతులు



సత్యవరంలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం



డ్రోన్ యంత్రంలో పురుగు మందులు వేస్తున్న రైతులు

నియోజకవర్గం : మాడుగుల
రబీ వరి సాగు : 14 వేల ఎకరాలు
రబీ వరి సాగు రైతులు: 16 వేల మంది

మాడుగుల : ఈ ఏడాది రబీ వరి దిగుబడులు కలిసి వస్తాయని రైతులు ఆశ పడ్డారు. కానీ అధిక మంచుతో చేలన్నీ తెగుళ్లకు గురవుతున్నాయి. గ్రామాల్లో కూలీలందరూ ఉపాధి హామీ పథకంలో పాల్గొనడంతో రైతులు కనీసం కలుపు, పురుగు మందులు వేయలేక ఇబ్బందులు పడుతున్నారు. యంత్రాలతో వ్యవసాయం సన్నకారు రైతులకు బరువవుతోంది. పెద్ద రైతులు డ్రోన్‌లతో పురుగు, కలుపు మందులు పిచికారీ చేయించుకుంటున్నారు. ఈ యంత్రాలు 10 ఎకరాలు పైగా సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు అవుతుంది. రెండెకరాలలోపు రైతులకు డ్రోన్స్ రావడం లేదు. ఉపాధి హామీ పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని, సన్న చిన్న కారు రైతులను ఆదుకోవాలని గ్రామీణ ప్రాంత రైతులు కోరుతున్నారు.

డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీ : డ్రోన్‌తో ఎకరా పొలం గంటలో పిచికారీ చేస్తుంది. రూ.400 ఖర్చు అవుతుంది. ఇదే కూలీలతో ఎకరాకు రూ.300 ఖర్చు అవుతుంది. ఒక రోజుకు డ్రోన్ యంత్రంతో 40 ఎకరాలు పిచికారీ చేస్తారు. బడా రైతులు డ్రోన్ యంత్రాలతో పురుగు మందులు, ఎరువులు పిచికారీ చేసుకుంటున్నారు. చిన్నకారు రైతులు అటు డ్రోన్‌తో చేయించుకోలేక కూలీలు దొరకక చేలన్నీ పురుగుపట్టి పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మంచు అధికంగా ఉండడం వల్ల కూడా వరి చేలు దెబ్బతింటున్నాయి. దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో ఉండవని రైతులు చెబుతున్నారు.

అందని ప్రభుత్వ సాయం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ఖరీఫ్‌తో పాటు ప్రస్తుతం రబీకి కూడా రూపాయి సాయం అందలేదు. పెట్టుబడులు అధికంగా ఉన్నాయి. రబీ పంటలకు మంచు దెబ్బ తగిలింది. దీంతో రబీ అంతగా చేలు బాగోలేదు. ప్రభుత్వం స్పందించి సన్న చిన్న కారు రైతులను ఆదుకోవాలని నియోజకవర్గ రైతులు కోరుతున్నారు.

కూలీలు దొరకడం లేదు...



కూలీలతో వ్యవసాయం అధిక దిగుబడులు వస్తాయి. యంత్రాలతో చేనంతా పాడైపోతుంది. కూలీలతో పిచికారీ చేస్తే చేనంతా తడుస్తుంది. చేలలో తిరగడం వల్ల కలుపు రాకుండా ఉండడంతో పాటు వేర్లు తెగి చేలు ఏపుగా ఎదుగుతాయి. కూలీలు లేక తప్పని పరిస్థితిలో డ్రోన్‌లతో పురుగు మందులు పిచికారీ చేయిస్తున్నాం. ఈ ఏడాది మాత్రమే కూలీలు దొరకక దూర ప్రాంతాల నుంచి డ్రోన్ యంత్రాలు తీసుకువచ్చి చేలపై పిచికారీ చేయి స్తున్నాం. మంచు బాగా ఉండడంతో రబీ కలిసి రాలేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– నాగేశ్వరరావు, రైతు, సత్యవరం

గరిశింగిలో ఆదివాసీ గిరిజనులకు మంచినీటి సౌకర్యం

పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు



గిరిజనులతో మాట్లాడుతున్న గరిశింగి సర్పంచ్ గూడెపు రాము, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చంద్రశేఖర్

దేవరాపల్లి: గరిశింగి పంచాయతీ శివారు కొండపై నివసిస్తున్న ఆదివాసీ గిరిజన కుటుంబాలకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు సర్పంచ్ గూడెపు రాము తెలిపారు. ఈ మేరకు సదరు ఆదివాసీ కుటుంబాలు నివాస ప్రాంతాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.చంద్రశేఖర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. వీరికి తాగునీటిని సమకూర్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. సమీపంలో బావిలో నీరు ఊటగా రావడాన్ని గుర్తించి, ఆ బావిలో నందలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో మోటారు ఏర్పాటు చేసి ప్లాస్టిక్ ట్యాంక్‌లోకి పంపింగ్ చేసి తద్వారా అక్కడ నివసిస్తున్న ఎనిమిది కుటుంబాలకు ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు సర్పంచ్ తెలిపారు. దశాబ్దాలుగా వేధిస్తున్న మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. కాగా వారం రోజుల క్రితమే ఈ ఆదివాసీ కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని, తన హయాంలో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో గూడెపు మోహన్, దువ్వార చిలుకు, వంజువంజుల నాగరాజు, గూడెపు అప్పారావు తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి గోపినాథ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుల్తాన్ పాల్గొన్నారు.

జీడి పిక్కలను ఆర్బీకే ద్వారా కొనుగోలు చేయాలి



దాలివలసలో జీడి రైతుల సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న నాయినిబాబు, తదితరులు

కె.కోటపాడు : జీడి పిక్కలను రాష్ట్ర ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయించాలని సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు అన్నారు. దాలివలస గ్రామంలో గల సచివాలయ సిబ్బందికి జీడి రైతుల సమస్యలపై మంగళవారం ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి పిక్కలకు కిలోకు రూ.200 మద్దతు ధరను కల్పించాలని కోరారు. జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక నిధిని కేటాయించాలని తెలిపారు. జీడి సాగుకు అవసరమైన పనిముట్లను రైతులకు ఉచితంగా అందించడంతో పాటు ఉపాధి హామీ నిధులను జీడి సాగు రైతులకు ఎకరానికి రూ.94వేలను అందించి పంటను ప్రోత్సహించాలని, బ్యాంక్ రుణాలను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు, జీడి సాగు రైతులు పాల్గొన్నారు.

అనధికార మోటార్ల తొలగింపు



కొండయ్యపాలెంలో అనధికార మోటార్లను తొలగిస్తున్న ఎంపీడీవో అప్పారావు తదితరులు

మాడుగుల రూరల్: పోతనపూడి గ్రామ పంచాయతీ శివారు గ్రామాల్లో డీజే మోటార్ల ద్వారా మంచినీటిని ఇళ్లపై ట్యాంకులకు సరఫరా చేస్తున్న వారిపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగమల్లేశ్వరి మంగళవారం పోతనపూడి శివారు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. కొండయ్యపాలెం, పెంటయ్యపాలెం గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు పరిశీలించారు. అనధికార మోటార్లను వెంటనే తొలగించాలని, లేదంటే కేసులు పెడతామని హెచ్చరించారు. డీజే మోటార్ల వల్ల ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందడం లేదని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ఎంపీడీవో వెంట సచివాలయ సిబ్బందితో పాటు గ్రామపెద్దలు కోరుకొండ సాంబమూర్తి, పడాల దేముడు, బంటు సోమునాయుడు, గుడివాడ సూరిబాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సమావేశ షెడ్డుకు రూ.2 లక్షలు మంజూరు



కె.జె.పురం పీహెచ్‌సీలో వైద్యాధికారి లీలాప్రసాద్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. లాబొరేటరీ, ఆపరేషన్ థియటర్, వార్డును పరిశీలించారు. మందులు, ఓపీ వివరాలను వైద్యాధికారి లీలాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో సమావేశాల నిర్వహణకు సంబంధించి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని షెడ్డు నిర్మాణానికి మండల పరిషత్ నిధుల నుంచి రూ. 2 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఎంపీపీ ప్రకటించారు. బుధవారం నుంచి ఈ షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆయన సిబ్బందితో బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకున్నారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

రావికమతం: వివిధ రకాల పంటల్లో తెగుళ్లు సోకకుండా విత్తనాలు ఎలా శుద్ధి చేసుకోవాలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోర్డినేటర్ డాక్టర్ రాజకుమార్, టీవో టి.డాక్టర్ కిషోర్ పర్యవేక్షణలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు మత్స్యవానిపాలెం గ్రామంలో రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. విత్తనాలు శుద్ధి చేయడం వల్ల కలిగే లాభాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు బిందు మాధవి, మేఘన, రచన, చరిష్మా, మణిదీపిక, అంకిత పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించాలి



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

నర్సీపట్నం : మున్సిపాలిటీలో నిర్మించిన టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం బృందం బలిఘట్టంలోని టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం 1824 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి అయినా వాటర్, సెప్టిక్ ట్యాంకులు, రోడ్లు, కరెంట్ సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టి సుమారు పదేళ్లు కావస్తోందన్నారు. నేటికి లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించలేదన్నారు. ఇళ్లు అప్పగించకుండానే రుణాలు చెల్లించాలని బ్యాంక్ అధికారులు లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, రాము, శేషు పాల్గొన్నారు.

వర్గీకరణలో రెల్లి కులానికి అన్యాయం

నర్సీపట్నం: ఎస్సీ వర్గీకరణలో అణగారిన రెల్లి కులానికి అన్యాయం జరిగేలా ప్రభుత్వం వ్యవహరించిందని రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి పాపారావు పేర్కొన్నారు. రెల్లి కులానికి ఒక శాతం రిజర్వేషన్ కల్పించడం అన్యాయమన్నారు. రెల్లి వాటి ఉప కులాల స్థితిగతులను పునరాలోచన చేసి రెల్లి కులాలకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం మరోసారి ఆలోచన చేసి రెల్లి కులస్తుల వాటా పెంచేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

రాజన్నపేటలో ఇంటింటా కుళాయి కనెక్షన్లు



రాజన్నపేటలో తాగునీటి పైపులైను పనులు

రోలుగుంట : శరభవరం పంచాయతీ శివారు రాజన్నపేటకు గత ప్రభుత్వ హయాంలోనే జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటా కుళాయిల ఏర్పాటు కోసం రూ.22 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో గ్రామానికి తాగునీటి సరఫరా కోసం వాటర్ ట్యాంకు పనులు పూర్తి కాగా మూడు రోజులుగా ఇంటింటా తాగునీటి సరఫరా కోసం పైపులైను పనులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ బాబు పర్యవేక్షణలో పూర్తి చేసి కుళాయిలకు కనెక్షన్లు ఇచ్చారు. ఇంటింటా తాగునీరు సరఫరా కూడా జరుగుతుందని ఏఈ తెలిపారు.

ఎం.అలమండలో ఆక్రమణలు తొలగించాలి



ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ దాడి జగన్

దేవరాపల్లి: ఎం.అలమండ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించాలని సర్పంచ్ దాడి జగన్ తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి మంగళవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 524 లో 0.09 సెంట్ల రస్తా పోరంబోకు(గోర్జు) స్థలాన్ని ఆదే గ్రామానికి చెందిన వనుము అచ్చియమ్మ, నాగేష్ దంపతులు ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఈ అక్రమణలను అప్పటి తహసీలార్లు జె.రమేష్ బాబు, ఎం.లక్ష్మిలు పోలీసుల సమక్షంలో తొలగించారని, మరలా తాజాగా యథావిధిగా ఆక్రమణకు గురైందన్నారు. వెంటనే స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సిబ్బందిని పంపించి, ఆక్రమణలు వాస్తవమైతే వెంటనే తొలగించే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన వారిలో పాలి పిరెడ్డి రమణ, అశోక్ తదితర గ్రామస్తులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు అందించాలి



ఎం.కె.వల్లాపురంలో గమేళాలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

మాడుగుల రూరల్ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద పనిచేస్తున్న ఉపాధి కూలీలకు రెండు మాసాలుగా ఉపాధి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, బిల్లులు చెల్లించకపోతే ఏం తిని పని చేయాలంటూ ఉపాధి కూలీలు మంగళవారం గమేళాలు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మండలంలో ఎం.కె.వల్లాపురం ఘాట్‌రోడ్డు కాలువ పనిచేస్తున్న ఉపాధి కూలీలు సమ్మర్ అలవెన్సులు, ప్లే సిప్పులు పెండింగ్ బకాయిలు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరటా నర్సింహమూర్తి మద్దతు పలికారు. కూలీలకు ఉపాధి పనులు లేక ప్రతి రోజు వేలాది మంది ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస పోతున్నారని, ప్రమాదాల్లో ప్రతి నిత్యం పదుల సంఖ్యలో కూలీలు చనిపోతున్నారని అన్నారు. వేసవి కాలంలో కూలి గిట్టుబాటు కావడం లేదని, గతంలో ఇస్తున్న సౌకర్యాలు నిలిపివేశారని తెలిపారు. 100 రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పనిదినాలు పెంచాలని, సమ్మర్ అలవెన్సు 30 శాతం కలపాలని, ప్రతి వారం ప్లేసిప్పులతో పాటు పనిముట్లు, మంచినీళ్లకు రూ. 5 ఇవ్వాలని, మేట్లుకు ప్రతి కూలీపై రూ.5 పారితోషకం ఇవ్వాలని, ఉపాధి హామీ పనిలో యంత్రాలు, కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని, వ్యవసాయానికి అనుసంధానం చేయరాదని, అవినీతిని అరికట్టాలని, మస్తర్లను ఉపాధి సిబ్బందికి మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కాకర దేవి, కోట్ని లక్ష్మి, కోట్ని సత్యవతి, గొల్లవిల్లి కోటిమ్మ, కోమరి సూరిబాబు పాల్గొన్నారు.

'నిమ్మకట్టు' పనులు పరిశీలించిన కోటనందూరు రైతులు



నిమ్మకట్టు పనులను పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో ఆయకట్టు రైతులు

నాతవరం: నిమ్మకట్టు అనకట్టు ఆయకట్టు పంట కాలువల అభివృద్ధి పనులను కాకినాడ జిల్లా కోటనందూరు మండలం వాసులు మంగళవారం స్వయంగా పరిశీలించారు. మండలంలో రాజుపేట అగ్రహారం పంచాయతీ పరిధిలో తాండవ నదిపై బ్రిటిష్ హయాంలో నిమ్మకట్టు ఆనకట్టు నిర్మించారు. ఈ నిమ్మకట్టు ఆనకట్టు నీరు నాతవరం మండలంలో కంటే కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో రైతులకు అధికంగా ఉపయోగపడుతుంది. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో కోటనందూరు మండలం అల్లిపూడి, కాకరాపల్లి, కోటనందూరు, భీమవరపుకోట, జగన్నాథపురం, లక్ష్మిపురం ఎస్.ఆర్.పేట, అప్పలరాజుపేట గ్రామాలకు చెందిన రైతులు కాలువలో పూడికతీత పనులు శ్రమదానంతో చేసి శివారు ఆయకట్టుకు పంట పొలాలకు సాగు నీటిని తరలించుకునేవారు. ప్రస్తుతం నిమ్మకట్టు అనకట్టు కాలువలకు రూ.12లక్షలతో అభివృద్ధి పనులు జేఈ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో చేస్తున్నారు. అయా పనులకు కోటనందూరు మండలానికి చెందిన సీనీ ఆరిస్టు సాగు రైతు మహర్షి రమణ, తాండవ ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షుడు అప్పన దివాణం, ఆయకట్టుదారులు వీసం నూకరాజు, వనిమిన సూర్యారావు, సీతయ్య, సురేష్‌కుమార్ స్వయంగా పరిశీలించి నిబంధనల ప్రకారం నాణ్యతగా నిర్మాణం చేయాలని అధికారులకు సూచించారు.

జోగన్నపాలెంలో మావుళ్లమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : కింతాడ పంచాయతీ జోగన్నపాలెం గ్రామస్తులు మావుళ్లమ్మ అమ్మవారి పండగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. గ్రామానికి చెందిన కుబిరెడ్డి కుటుంబీకులు 30 ఏళ్ల తరువాత అమ్మవారి పండగను నిర్వహించారు. మావుళ్లమ్మ మందిరంలో ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరారు. మావుళ్లమ్మ మందిరంలో మాజీ డిప్యూటీ సీఎం, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలను జరిపారు. ఆయన వెంట సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు పాల్గొన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి



ప్రకృతి సేద్యంలో పండించిన కూరగాయల ప్రదర్శన పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం : ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులు దృష్టి సారించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులతో పండించిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన విక్రయాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులు దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులతో పాటు ఆదాయం పొందవచ్చున్నారు. ప్రస్తుతం మార్కెట్లో సేంద్రియ ఎరువుతో పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు ఊహించని గిరాకీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, వ్యవసాయశాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'పై అవగాహన



ఎల్ఈడీ స్క్రీన్‌పై గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజారావు

నర్సీపట్నం: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని రూరల్ ఎస్సై రాజారావు పేర్కొన్నారు. అవేర్నెస్ పోలీసు రథం ద్వారా మదర్ బీఎస్సీ నర్సింగ్ కాలేజీ, జెడ్పీ హైస్కూల్ చెట్టుపల్లిలో గుడ్ టచ్, బాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏది గుడ్ టచ్..ఏది బ్యాడ్ టచ్ అన్నది విద్యార్థులు గ్రహించి, బ్యాడ్ టచ్ అయితే తల్లిదండ్రులు దృష్టికి తీసుకువెళ్ళాలన్నారు. బాలికల రక్షణకు పోక్సో చట్టం ఉందన్నారు. ఈ చట్టంలో శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. బాల్య వివాహాలను ఎవరు ప్రోత్సహించినా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సూచించారు. అనంతరం ప్రచార రథం ద్వారా నేరాలపై అవగాహన కల్పించారు.

సీతారామాలయానికి హంగులు



కె.జె.పురం సీతారామాలయంలో మార్బుల్స్ వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో గల శ్రీ సీతా రామాలయంలో వచ్చే నెలలో జరిగే శ్రీరామ నవమి వేడుకలకు రంగులు, పునర్‌నిర్మాణ పనులు చేపట్టారు. ప్రధానంగా గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయం అంతా రంగులు వేస్తున్నారు. దీంతో పాటు ఆలయంలో గర్భగుడి, ముందు భాగంలో మార్బుల్స్‌తో పనులు చేపట్టారు. శ్రీరామ నవమి పర్వదినానికి ముందే పనులు పూర్తి చేయడానికి సిద్ధం చేస్తున్నారు.